క్లుప్తంగా

ఆహ్వానం



రాయపర్తి : ఈనెల 21న మండలంలోని కొండూరు గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో నిర్వహించనున్న స్కూల్ డే కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి ఉపాధ్యాయులతో కలిసి హెచ్‌ఎం పద్మలత శుక్రవారం పత్రిక అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేతో హెచ్‌ఎం మాట్లాడారు. స్కూల్ ఉన్నతి, విద్యార్థుల పురోగతిపై వివరించారు. కార్యక్రమానికి హాజరై విద్యార్థులకు స్ఫూర్తినివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామ్‌రెడ్డి, ఆచార్య, కటకం రఘు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ చర్యలు



నెక్కొండ : మండల కేంద్రంలో ప్రమాదాల నివారణ దిశగా ఎస్సై మహేందర్ చొరవ చూపారు. స్థానిక ప్లైఓవర్ పైన, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రమాదకరంగా ఉన్న గుంతల్లో ట్రాక్టర్‌తో మొరం పోయించారు. నెక్కొండ–పెద్దకోర్పోలు గ్రామాల మధ్య రహదారిపై అడ్డగా ఉన్న ముళ్లపొదలను జేసీబీతో తొలగింపజేశారు.

వక్ఫ్ సవరణపై నిరసన



నర్సంపేట : వక్ఫ్ సవరణ బిల్లుపై చెన్నారావుపేట మండలంలోని పాతమగ్దుంపురంలోని మజీదే మహ్మదీయ మసీదు ఆవరణలో ముస్లిం సోదరులు శుక్రవారం నమాజ్ అనంతరం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మసీదు ఇమామ్ ఇజాస్ మాట్లాడారు. ముస్లింల మతపరమైన హక్కులను కాలరాసేలా సవరణ బిల్లు తీసుకురావడం సరికాదన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ముస్లింల పట్ల వ్యతిరేక భావాన్ని ప్రదర్శించడం సరికాదన్నారు. వక్ఫ్‌ను రాజకీయం చేయవద్దని ఆకాంక్షించారు. వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో షేక్ మహ్మద్, మహ్మద్ ఖయాజ్, ఫయాజ్, పాషా, సమీర్, అక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు భూభారతిపై సదస్సు

దుగ్గొండి : నేడు (శనివారం) మండల కేంద్రంలోని రైతు వేదికలో భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహిస్తామని తహసీల్దార్ రవిచంద్రారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు మండలానికి చెందిన రైతులు సకాలంలో హాజరై అవగాహన పెంచుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ సత్యశారద, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హాజరై ప్రభుత్వ ఉద్దేశ్యం, లక్ష్యాన్ని వివరిస్తారని పేర్కొన్నారు.

నివాళి



రాయపర్తి : మండలంలోని పెర్కవేడుకు చెందిన దుర్శెట్టి మల్లమ్మ (76) కోతుల దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా ఆమె మృతదేహానికి తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యా నాయక్ శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. మల్లమ్మ మృతి బాధాకరమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ గ్రామ నాయకులు బండి కుమార్, వెంకటాచారి, నాగరాజు, రాజేంద్రప్రసాద్, రజినీకాంత్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పాపయ్యపేటలో..

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటలో బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుడు కందాల చంద్రమౌళి తల్లి వీరలక్ష్మి బాయి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందగా ఆమె మృతదేహానికి ఆ పార్టీ మండల అధ్యక్షుడు దామెరుప్పుల శేఖర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చంద్రమౌళిని శేఖర్ పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు మామిడాల రమేశ్, లక్ష్మీనర్సయ్య, దామెరుప్పుల శ్రీను, యాకయ్య, వడ్లకొండ రాజశేఖర్, మాసాడి నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన ఎలక్ట్రిక్ బస్సు

దామెర : ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి ఎలక్ట్రికల్ బస్సు అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. వివరాలిలా.. ఏటురునాగారం నుంచి హనుమకొండకు వస్తున్న ఎలక్ట్రిక్ బస్సు మండలంలోని ఒగ్లాపూర్ శివారులో అదుపు తప్పింది. ఎవరికీ హాని జరుగలేదు. వరంగల్–2 డిపో మేనేజర్ జ్యోత్స్న, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

అవెన్యూ ప్లాంటేషన్‌పై నిర్లక్ష్యం

● ఎండిపోతున్న మొక్కలు



గురిజాల హైస్కూల్‌లో ఎండిపోతున్న మొక్కలు

నర్సంపేట రూరల్ : అవెన్యూ ప్లాంటేషన్‌పై అధికారుల నిర్లక్ష్యం రాజ్యమేలుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా నాటే లక్ష్యంతో పెద్ద ఎత్తున ప్రజాధనాన్ని వెచ్చించి సమకూర్చిన మొక్కలను పట్టించుకోకపోవడంతో ఎండిపోతున్న దుస్థితి నెలకొంది. కనీసం ఉదయం, సాయంత్రం వేళల్లో నీళ్లు సైతం పట్టడం లేదు.

నర్సంపేట మండలంలోని గురిజాల నుంచి నర్సంపేట ప్రధాన రహదారిలో, గురిజాల నుంచి లింగాపురం మీదుగా గిర్నిబావికి వెళ్లే రహదారికి ఇరువైపులా మొక్కలు నాటేందుకు అటవీ శాఖ అధికారులు మొక్కలు తీసుకొచ్చారు. వాటిని గురిజాల గ్రామంలోని ప్రభుత్వ జెడ్పీ సెకండరీ స్కూల్ ఆవరణలోని మహావృక్షం కింద నిల్వ చేశారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో నీళ్లు పట్టడాన్ని విస్మరించారు. ఎండ తగలకుండా షైన్ నెట్ ఏర్పాటు చేసినా నీళ్లు పట్టేందుకు వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయలేదు. మొక్కలను చెట్టు కిందే వదిలేయడంతో అవి ఎండిపోతున్నాయి. మొక్కలు కొనుగోలు, తరలింపు కోసం పెద్దమొత్తంలో ప్రజాధనాన్ని వెచ్చించి మొక్కలు నాటకుండానే ఎండిపోతున్నా పట్టించుకోవడం లేదంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి మొక్కలను సంరక్షించి ఎవెన్యూ ప్లాంటేషన్‌ను విజయవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రక్షణ చర్యలు చేపడతాం

గురిజాల హైస్కూల్ ఆవరణలోని మొక్కల రక్షణకు చర్యలు చేపడతాం. మొక్కలు ఎండిపోతున్న విషయం మాకు తెలియదు. మొక్కలకు నీటి సరఫరా, ఇతర ఏర్పాట్లు చేయిస్తాం.

– రవికిరణ్, ఎఫ్‌ఆర్‌ఓ, నర్సంపేట

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



నర్సంపేట : సిలువ వద్ద ప్రార్థన చేస్తున్న భక్తులు



నల్లబెల్లి : సందేశాన్ని వినిపిస్తున్న పాస్టర్ ప్రసాద్

నర్సంపేట : చెన్నారావుపేట మండలం తిమ్మరాయినిపహాడ్‌లో క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే నిర్వహించారు. భస్మ బుధవారం నుంచి 41 రోజులపాటు ఉపవాసం పాటించి శుక్రవారం నాడు సిలువ ధ్యానం అనంతరం నిమ్మరంతో ఉపవాసం విరమించారు. ఈ సందర్భంగా పునీత రాయప్ప చర్చి ఫాదర్ తుమ్మ యాగారెడ్డి మాట్లాడారు. యేసుక్రీస్తు సిలువలో మానవాళి రక్షణ కోసం తన ప్రాణాన్ని త్యాగం చేశాడన్నారు. ఆయన చిందించిన రక్తంతోనే మానవాళికి పాపాల నుంచి విముక్తి లభిస్తోందని తెలిపారు. తొలుత గ్రామంలో భక్తులు సిలువ మోస్తూ 14 స్థలాల్లో క్రీస్తు శ్రమలను ధ్యానిస్తూ ప్రదక్షిణ చేశారు. అనంతరం చర్చి ఆవరణలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి పెద్దలు కొండవీటి ప్రదీప్‌కుమార్, మల్లవరపు ఇన్నయ్య, నాగోతు గోపయ్య, నరిశెట్టి రాజు, పుట్టి భాస్కర్, ఏటుకూరి దేవదానయ్య, పూదోట సుందర్‌రాజు, బెల్లంకొండ బాలస్వామి, పుట్టి శౌరిరాజు, నరిశెట్టి కస్పరాజు, యదనపల్లి జయరాజు, నాగోతు జోసఫ్ తంబి, రెడ్డిమాసు కిశోర్, జాన్ క్రిస్టొఫర్, అనిల్‌కుమార్, పూదోట కిరణ్‌కుమార్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : మండలంలోని పలు చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తొలుత గ్రామాల్లో సిలువను మోస్తూ ప్రదర్శన నిర్వహించారు. యేసుక్రీస్తు సేవలను కీర్తించారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయండి



నర్సంపేట : మాట్లాడుతున్న వెంకటనారాయణ



నర్సంపేట రూరల్ : రాజుపేటలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

● బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటనారాయణ

నర్సంపేట : ఈనెల 27న ఎల్కతుర్తి సమీపంలో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ గౌడ్, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు కోరారు. పట్టణంలోని 6, 7వ వార్డుల్లో నిర్వహించిన సన్నాహక సమావేశాల్లో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అనేక మోసపూరిత హామీలతో ప్రజలను నమ్మించి ఓట్లు దండుకుని గద్దెనెక్కిందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి దుష్టపాలన సాగిస్తున్న కాంగ్రెస్‌కు ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి సభకు ప్రజలను ఆహ్వానించాలని శ్రేణులకు సూచించారు. సమావేశంలో పార్టీ క్లస్టర్ బాధ్యులు బండి రమేష్, మాజీ కౌన్సిలర్లు పెండెం వెంకటేశ్వర్లు, వాసం సాంబయ్య, రామసహాయం సుధాకర్‌రెడ్డి, పట్టణ మహిళా నాయకురాలు చింతం విజయరాణి, వార్డు కమిటీ అధ్యక్షులు దొంగల సురేష్, దుగ్గి రాజు, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట మండలంలో..

పాపయ్యపేట, బోజెర్వు, ఎల్లాయిగూడెం, ధర్మతండా, అమృతండా, పుల్లయ్యబోడుతండా, బోడ మాణిక్యంతండా, 16 చింతల్‌తండా గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో బీఆర్‌ఎస్ మండల బాధ్యుడు బాల్నె వెంకన్న మాట్లాడారు. అనంతరం రజతోత్సవ సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశాల్లో మాజీ ఎంపీపీ జక్క అశోక్, నాయకులు బోడ బద్దునాయక్, అనుముల కుమారస్వామి, బోడ మురళీనాయక్, తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని రాజుపేట, ముత్తోజిపేట, ముత్యాలమ్మతండాలో సభ వాల్‌పోస్టర్లను పార్టీ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమాల్లో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు, క్లస్టర్ ఇన్‌చార్జులు మోటూరి రవి, తాళ్లపెల్లి రాంప్రసాద్, కడారి కుమారస్వామి, గోడి శ్రీనివాస్‌రెడ్డి, బానోత్ దస్రు, భూక్య సైదా, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండలంలోని గోపనపల్లి, కొంకపాక, అనంతారం, శ్రీనగర్, చౌటపల్లి, సోమారం, జమలాపురం, గోరుగుట్టతండాలో నిర్వహించిన సమావేశాల్లో గ్రేటర్ వరంగల్ మాజీ కార్పొరేటర్ చింతల యాదగిరి మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ సభపై ప్రజలకు వివరించాలని శ్రేణులను కోరారు. సమావేశాల్లో పర్వతగిరి సొసైటీ చైర్మన్ మోటపోతుల మనోజ్‌గౌడ్, మాజీ రైతుబంధు అధ్యక్షుడు చిన్నపాక శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు కోల మల్లయ్య, సూర రమేష్, కరిమిళ్ల మోహన్‌రావు, మట్టపల్లి లావణ్య, మాజీ సర్పంచ్‌లు దేవేందర్, మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'సీపీఐ కాలనీపై దుష్ప్రచారం తగదు'

నర్సంపేట రూరల్ : పట్టణంలోని సీపీఐ కాలనీపై కొన్ని సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేయడం తగదని భారతీయ జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) జిల్లా అధ్యక్షురాలు పాలక కవిత అన్నారు. ఆ కాలనీలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కాలనీవాసుల్లో అత్యధికులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే ఉన్నారని చెప్పారు. భూమి లేని పేదలు పార్టీ ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారని తెలిపారు. మాదన్నపేట రోడ్డులో ఇటీవల పోలీసులు కొందరిని అరెస్ట్ చేయగా నిందితులు సీపీఐ కాలనీకి చెందిన వారంటూ సామాజిక మాధ్యమాల్లో కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అసాంఘిక కార్యకలాపాలను పార్టీ, సమాఖ్య ప్రోత్సహించవని, సహించబోదని స్పష్టం చేశారు. సమావేశంలో సమాఖ్య మండల అధ్యక్ష, కార్యదర్శులు చెట్టే మమత, సింగారపు శైలజ, అయిత శ్రీకళ, హంస మంజుల, అరుణ, దివ్య, తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల అందజేత



ఖానాపురం : మండలంలోని రాగంపేటలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు ఆశ కార్యకర్త తడుగుల సంధ్య శుక్రవారం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఎండల తీవ్రత నేపథ్యంలో కూలీలు ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పని ప్రదేశాల్లో కూలీల కోసం మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తితే వెంటనే ప్రాథమిక చికిత్స అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కారోబార్ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం



వర్ధన్నపేట : వర్ధన్నపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని డీసీ తండా పరిసరాల్లో ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించి 10 లీటర్ల గుడుంబాతోపాటు నిందితుడు వినియోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆ శాఖ సీఐ స్వరూప మీడియాకు వివరాలు వెల్లడించారు. దాడుల సందర్భంగా వరంగల్‌కు బైక్‌పై గుడుంబా తరలిస్తున్న డీసీ తండాకు చెందిన మూడు మోహన్ పట్టుబడ్డట్టు తెలిపారు. మోహన్ నుంచి గుడుంబాతోపాటు బైక్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు చెప్పారు. దాడుల్లో ఆ శాఖ ఎస్సైలు సరిత, గంగాధర్, హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్, కానిస్టేబుళ్లు రమేష్‌బాబు, శరత్‌కుమార్, బాబు, వంశీ, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

గూడూరు : మండల కేంద్రంలో కోబల్‌తండాకు చెందిన మాజీ ఎంపీటీసీ భాస్కర్‌తోపాటు పలువురు, దామరవంచకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం శంకర్ నాయక్ మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేం వెంకటకృష్ణారెడ్డి, సంపత్‌రావు, నర్సింహానాయక్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో అగ్ని ప్రమాదాలకు చెక్

● అగ్నిమాపక అధికారి జయపాల్‌రెడ్డి



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

వర్ధన్నపేట : అవగాహన పెంచుకోవడం ద్వారా అగ్ని ప్రమాదాలకు చెక్ పెట్టొచ్చని స్థానిక అగ్నిమాపక అధికారి జయపాల్‌రెడ్డి తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని పెట్రోల్ పంపులు, రైస్ మిల్లులు, ఇతర పరిశ్రమల వద్ద కార్మికులకు, సిబ్బందికి శుక్రవారం అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం జయపాల్‌రెడ్డి మాట్లాడారు. గ్యాస్ సిలిండర్, స్టౌ, రెగ్యులేటర్ వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రమాదం జరిగితే వెంటనే డయల్ 101కు లేదా దగ్గరలోని అగ్నిమాపక కేంద్రానికిసమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆ శాఖ సిబ్బంది దిలీప్ కుమార్, అన్నమయ్య, రమేష్, నవీన్, హోం గార్డు రఘు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కుట్రలను తిప్పికొడతాం



దివిటిపల్లిలో మాట్లాడుతున్న రాజిరెడ్డి

● బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజిరెడ్డి

వర్ధన్నపేట : రాజ్యాంగంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొడతామని, ఆ లక్ష్యంతో గ్రామాల్లో జై బాపు, జై భీమ్ సంవిధాన్ ర్యాలీలు నిర్వహిస్తున్నట్టు స్థానిక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి తెలిపారు. మండలంలోని రామవరం, దివిటిపల్లి, బండౌతాపురం గ్రామాల్లో పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ర్యాలీకి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని తెలిపారు. సుమారు వందేళ్లకుపైగా చరిత్ర కలిగిన కాంగ్రెస్‌పై దుష్ప్రచారం చేస్తోందని చెప్పారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ బీజేపీ కుట్రలను తిప్పికొట్టే దిశగా కార్యాచరణ చేపడుతున్నట్టు తెలిపారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారయణ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ప్రజలను కలుస్తూ రాజ్యాంగ ప్రాశస్త్యం, కాంగ్రెస్ పాలనపై వివరిస్తున్నట్టు తెలిపారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పాలన సాగిస్తోందని చెప్పారు. అంబేడ్కర్‌ను, రాజ్యాంగాన్ని చులకన చేసేలా బీజేపీ చేపడుతున్న తప్పుడు విధానాలపై ప్రజలు ఆలోచించాలని కోరారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ జనగం రమేష్, నాయకులు పోశాల వెంకన్న, తాళ్లపెల్లి శ్రీనివాస్, మరుపట్ల సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ రైతులకు పట్టాలిప్పించండి

● బీజేపీ జిల్లా కార్యదర్శి అశోక్



కిషన్‌రెడ్డికి సమస్యలు వివరిస్తున్న అశోక్

నల్లబెల్లి : మండలంలోని మేడపల్లి, గోవిందాపూర్, కొండాపూర్ ఏజెన్సీ గ్రామాల పరిధిలో నాలుగు దశాబ్దాలుగా జీవనం కొనసాగిస్తున్న రైతులకు పట్టాలిప్పించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని బీజేపీ జిల్లా కార్యదర్శి తడుక అశోక్ గౌడ్ కోరారు. ఆయన ఆధ్వర్యంలోని బృందం కిషన్‌రెడ్డిని హైదరాబాద్‌లో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా సదరు ఏజెన్సీ గ్రామాలకు చెందిన రైతుల సమస్యలను మంత్రికి అశోక్ వివరించారు. ఏజెన్సీ గ్రామాల రైతుల సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో రైతులు సంగ పోషాలు, శ్రీనివాస్, బాబు, రాజు, రవీందర్, చేరాలు, తదితరులున్నారు.

అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం



కటాక్షపూర్‌లో మామిడితోటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

● పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు : అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయమని నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కటాక్షపూర్‌లో ఇటీవల కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న మామిడి తోటలను శుక్రవారం ఆయన పరిశీలించి బాధిత రైతులకు భరోసా కల్పించారు. అలాగే నీరుకుళ్ల శివారులో ప్రభుత్వ భూములను పరిశీలించారు. నిరుపేదలకు స్థలాన్ని పంపిణీ చేసి మోడల్ కాలనీగా తీర్చిదిద్దుతానని అన్నారు. అలాగే నీరుకుళ్లలో ఇళ్లపై నుంచి వెళ్తున్న 11కేవీ లైన్లను షిఫ్టింగ్ చేసే కార్యక్రమాన్ని అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా రూ.1.41 కోట్ల ఎస్డీఎఫ్ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలన్నారు. నష్టపోయిన రైతులను ఆదుకుంటామన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్, నాయకులు బీరం సుధాకర్‌రెడ్డి, పరికిరాల వాసు, పర్వతగిరి రాజు, అర్షం వరుణ్‌గాంధీ, రవిందర్‌గౌడ్, రజనీకర్ తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

● కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌రావు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అనిల్

పర్వతగిరి : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. మండలంలోని చౌటపల్లి, తురకల సోమారం, దౌలత్‌నగర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం వారు ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను దళారుల బారి నుంచి కాపాడడంతోపాటు సరైన ధర కల్పించి ఆదుకునే దిశగా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో తాలు, తేమ, తరుగు పేరుతో రైతులను దోచుకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు గోపాల్‌రావు, యాక్యనాయక్, నాయకులు కుమార్‌రావు, అమృతరావు, గడ్డం జనార్దన్, పంతులు నాయక్, కత్తుల వెంకన్న, సదయ్య, శ్రీనివాస్, లచ్చునాయక్, సుధాకర్, బిచ్చనాయక్, చల్ల వెంకన్న, బందెల వెంకన్న, వంగ సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'వేతనాల చెల్లింపులో విఫలం'

దామెర : ఫిష్‌బండ్ పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు నెల రోజులు కావస్తున్నా నేటికి వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ల్యాదెళ్ల గ్రామంలోని చెరువులో ఫిష్‌బండ్ చేస్తున్న కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూలీ చేసిన డబ్బులు మాకు నెల రోజులైనా రావడం లేదని ఎలా బతకాలని ఆవేదన చెందుతున్నారని ఆయన తెలిపారు. మండుటెండల్లో కూలీలు పని చేస్తున్న కూలీలకు పనుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని తెలిపారు. ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలను వెంటను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'అభియోగాలను నిరూపించాలి'

గూడూరు : రాజకీయ ముసుగులో అవినీతి అక్రమాలు, భూదందాలకు పాల్పడుతూ ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు తనపై చేసిన అభియోగాలను నిరూపించాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బానోతు చందూనాయక్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కుల సంఘం పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నానని బుధవారం తనపై డీఎల్‌పీఓకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు కత్తి స్వామి, నూనావత్ రమేశ్, వాంకుడోతు కొమ్మాలును హెచ్చరించాడు. కాంగ్రెస్ నాయకులు ముగ్గురు మూడు విధాలుగా ప్రజలను మోసగిస్తుండడాన్ని నిరూపిస్తా అన్నారు. తాను వసూళ్లకు పాల్పడినట్లు నిరూపిస్తారా? అని ప్రశ్నించారు.

అదృశ్యమైన బాలుడి అప్పగింత

గూడూరు : జనవరి నెలలో ఆశ్రమ పాఠశాలకు వచ్చి అదృశ్యమైన బాలుడు ఆంధ్ర ప్రదేశ్‌లోని రాజమహేంద్రవరంలో ఉన్నాడన్న విషయం తెల్సుకున్న ఎస్సై గిరిధర్‌రెడ్డి, అక్కడికి వెళ్లి తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించిన సంఘటన శుక్రవారం జరిగింది. ఎస్సై బి. గిరిధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. కేసముద్రం మండలం కోమటిపల్లికి చెందిన ఇస్లావత్ నర్సింహా కొడుకు చరణ్, గూడూరు మండలంలోని సీతానగరం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. జనవరిలో సంక్రాంతి సెలవులకు ఇంటికి వెళ్లిన చరణ్, సెలవులు ముగిశాక.. జనవరి 23న పాఠశాలకు వచ్చి కనిపించకుండా పోయాడు. విషయం ఆలస్యంగా తెల్సుకున్న బాలుడి తండ్రి ఇస్లావత్ నర్సింహా పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై మూడు నెలలుగా ఆరా తీసాడు. ఇటీవల ఏపీలోని రాజమహేంద్రవరంలో కూలీ పనులు చేస్తున్నాడని తెల్సుకున్నాడు. చాకచక్యంగా సిబ్బందితో కల్సి వెళ్లిన ఎస్సై బాలుడిని గుర్తించి తీసుకొచ్చినట్లు తెలిపారు.